ప్రమాదకర స్థితిలో కాలిబాట వంతెనలు


బ్రాడీపేట బైపాస్ రోడ్డు వైపు సైడ్ రెయిలింగ్ పోయిన వంతెన


నాగరాజు పేట వైపు ప్రమాదకరంగా ఉన్న వంతెన


శిథిలావస్థలో ఉన్న ఎర్ర వంతెన

పెరుగుతున్న ప్రజారవాణా, తగ్గుతున్న సౌకర్యాలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నరసాపురం–నిడద వోలు కాలువపై మూడు కాలిబాట వంతెనలు ఉన్నాయి. కాలువకు అవతల ఉన్న మావుళ్లమ్మపేట, బ్రహ్మానందరెడ్డి కాలనీ ప్రజలకు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులకు, పాలకొల్లు రూరల్ పంచాయితీ నాగరాజు పేట, సాయినగర్ కాలనీ, వడ్లవానిపాలెం , వేడంగి పాలెం గ్రామ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వెళ్లే ప్రజలకు ఈ మూడు వంతెనలు చాలా ముఖ్యమైనవి. ఈ మూడు వంతెనలు గాంధీబొమ్మల సెంటర్ వద్ద దాసరి నారాయణరావు కాలిబాట వంతెన, ఎర్ర వంతెన, బ్రాడీపేట బైపాస్ రోడ్డు వంతెనలు నడిచి వెళ్లడానికి, మోటర్ వాహనాలపై వెళ్లడానికి అనుకూలంగా ఉన్నాయి. భారీ వాహనాలు రావాలంటే లాకులు వద్ద ఉన్న వంతెనలే ప్రధాన రహదారులు. ఈ మూడు వంతెనల్లో ఎర్రవంతెన నడిచి వెళ్లడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ వంతెనను 1951లో నిర్మించారు. అలాగే 1994లో నిర్మించిన బ్రాడీపేట వంతెన అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. జనాభా పెరగడంతో ఈ వంతెనలపై రవాణా కూడా పెరిగింది.

ఒక్క వంతెనే ఆధారం

ప్రస్తుతం దాసరి నారాయణరావు వంతెన ఒక్కటే అనుకూలంగా ఉండగా ఈ రెండు వంతెనలు మాత్రం ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అత్యవసరమైతే ఈ ప్రమాదకరమైన వంతెనలపైనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఎర్రవంతెన నిర్మాణం జరిగి 73 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. కానీ నేడు నడవడానికి కూడా అనుకూలంగా లేని దుస్థితిలో ఉంది. బ్రాడీపేటలో నిర్మించిన వంతెన 30 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. సైడ్ రెయిలింగ్ ఊడిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఆదమరిచినా, రాత్రి సమయంలో లైట్లు లేకపోయినా ప్రమాదాలకు నిలయంగా ఈ వంతెన ఉండడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఈ వంతెనకు మరమ్మతులు చేయించి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పరిధితోనే సమస్య

పట్టణంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డు వద్ద ఉన్న నాగరాజు పేట కాలిబాట వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. కాలువ అవతల రూరల్ పంచాయతీ, ఇటు వైపు మునిసిపల్ పరిధిలో ఉన్న ఈ వంతెన 1994లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మించారు. దీని నిర్వహణ మాత్రం ఎవరు చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన మరమ్మతులు నిమిత్తం గతంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మునిసిపల్ శాక అధికారులు, గ్రామ పంచాయతీ శాఖ అధికారులను సంప్రదించగా ముగ్గురూ మా పరిధిలో లేదని వివరణ ఇస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే తాము నిర్మించి గ్రామ పంచాయతీకి అప్పగిస్తామని చెబుతున్నారు. గ్రామ పంచాయితీ అధికారులను ప్రశ్నిస్తే గతంలో మరమ్మతులు చేశామని ప్రస్తుతం రూరల్ పంచాయతీ పట్టణంలో విలీన ప్రక్రియ జరుగుతున్నందున తాము మరమ్మతులు చేయడానికి అనుమతులు ఉండాలని వివరిస్తున్నారు. మునిసిపల్ అధికారులను ప్రశ్నిస్తే ఆ వంతెన పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మించారని, మునిసిపాలిటీకి అప్పగించలేదని దాని నిర్వహణ ఎవరు చూస్తున్నారో తెలియదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెన ఏ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉందో గ్రహించి ఆ డిపార్ట్‌మెంట్ అధికారులతో వేగవంతంగా మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే మరమ్మతులు

బ్రాడీపేట బైపాస్ వద్ద ఉన్న కాలిబాట వంతెన ప్రమాదకరంగా ఉందని అంటున్నారు. వంతెనకు అక్కడక్కడా సైడ్‌వాల్ లేకపోవడం వల్ల ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన అక్కడి స్థానిక ప్రజలకు చాలా ఉపయోగకరంగా స్పెషల్ ఆఫీసర్‌గా వంతెన మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందో? అంచనాలు తయారు చేయించి అతి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– దాసి రాజు, ఆర్‌డీఓ, నరసాపురం

క్లుప్తంగా

పీఎంపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్


కనకం వరప్రసాద్

నరసాపురం: పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నరసాపురం పట్టణానికి చెందిన కనకం వరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. పాలకొల్లులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సంఘ రాష్ట్ర నేతల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ప్రసాద్ పీఎంపీ అసోసియేషన్ నరసాపురం శాఖ అధ్యక్షుడుగా ఉన్నారు. జిల్లా కార్యదర్శిగా కూడా గతంలో పని చేశారు. కొత్తగా తనపై ఉంచి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ప్రసాద్ చెప్పారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు


దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: భారతదేశపు మొట్ట మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు మంగళం పాండే, బకించంద్ర చటర్జీ, శంకరంబాడి సుందరాచారిల వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో హక్కులపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ కృష్ణ

పాలకొల్లు సెంట్రల్: మేథో సంపత్తి హక్కులతో పరిశోధనలు చేసే వారికి శిక్షణ శిబిరం ఎంతో ప్రయోజనం కలుగిస్తుందని కళాశాల విద్యా సంయుక్త సంచాలకులు డాక్టర్ సీహెచ్ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూ ఆధ్వర్యంలో మేథో సంపత్తి హక్కులపై అంతర్జాతీయ స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కులతో పరిశోధనలు చేసే వారికి పూర్తిస్థాయి హక్కులు పొందిన తర్వాతనే వాటిని ప్రకటించాలన్నారు. అప్పుడు ప్రచురణలు, ప్రయోగాలకు పూర్తిస్థాయిలో విలువ ఉంటుందన్నారు. ఆవిష్కరణలకు పరిరక్షణ హక్కులు కలిగి ఉండాలంటే తప్పకుండా మేథో సంపత్తి హక్కులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ డా టి.పవన్ కుమార్, జి.సాయి వైభవ్, డా. వి.యామిని, ఎ.వంశీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, కె భద్రాచలం, సీపీడీసీ డాక్టర్ బీవీ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవితల పోటీల విజేతల ప్రకటన

పెనుగొండ: ఉగాది సందర్భంగా చివటం సంగీత సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లోని విజేతలను నిర్వాహకురాలు గుండాల గీతా మహాలక్ష్మీ మంగళవారం ప్రకటించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 126 కవితలు అందగా, విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వేల్పూరుకు చెందిన హైమావతీ సత్య, ద్వితీయ బహుమతిని ఆముదాల వలసకు చెందిన కుప్పిలి వెంకట రాజారావు, తృతీయ బహుమతిని పెనుగొండకు చెందతిన ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తి గెలుచుకున్నారని, ప్రత్యేక బహుమతులను భీమవరానికి చెందిన దొంతాభక్తులని రామ నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడేనికి చెందిన కాసర లక్ష్మీ సరోజ, పెనుమంచిలికి చెందిన బాదరాల వీరాంజనేయులు, శ్రీకాకుళానికి చెందిన మల్లారెడ్డి రామకృష్ణ, నెల్లూరుకు చెందిన యర్రా బత్తిన మునీంద్రాలు గెలుచుకున్నారన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ పరిధిలో గల వీధి కుక్కల కేంద్రాన్ని రాజమహేంద్రవరం ఆర్‌డీఎంఏ సీహెచ్ నాగ నరసింహారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, కుక్కల కోసం ఏర్పాటు చేసిన అదనపు బోనులను, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తక్షణమే తగు ప్రణాళికను సిద్ధం చేసి దాని ప్రకారం ఈ నెల 11వ తేదీ నుంచి వార్డులో కుక్కలను పట్టి వాటికి నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించాలని ఒప్పంద ఏజెన్సీకి తెలిపారు. ఆయనతో పాటుగా భీమవరం పురపాలక సంఘ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, డిప్యూటీ ఇంజనీర్ రహీం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి ఆర్.సోమశేఖర్, సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

11న యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

తూర్పుతాళ్లులో రీ-సర్వే పనులు ప్రారంభం


రీ-సర్వే పనులపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: రైతులు రీ-సర్వేలో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. తూర్పుతాళ్లు గ్రామంలో మంగళవారం నుంచి చేపట్టనున్న మూడవ విడత రీ-సర్వే అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత గ్రామంలోని ప్రధాన రహదారులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా సరిహద్దులు, తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అయితం సత్యనారాయణ, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుమన్ కుటుంబ సభ్యులకు ముదునూరి పరామర్శ


బుడితి సుమన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ బుడితి సుమన్, రిటైర్డ్ తహసీల్దార్, మాజీ కౌన్సిలర్ బుడితి దిలీప్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మంగళవారం పరామమర్శించారు. సుమన్ తల్లి, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలు అడిగి తెలుకున్నారు. ధైర్యంగా ఉండాలని పరామర్శించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రమీల వైఎస్సార్ సీపీపై ఎంతో అభిమానంగా మెలిగేవారని అన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు, రేపు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

నరసాపురం: స్వయం ఉపాధి సోపానం పథకంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నరసాపురం పట్టణంలోని 31 వార్డుల వారికి మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో ఇంటర్వ్యూలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 16 వరకూ వార్డుల వారికి బుధవారం, 17 నుంచి 31 వరకూ వార్డుల వారికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు.

రేపు పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బీసీ, కాపు కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడితో కూడిన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని నిరసన


పెనుగొండ: ఆచంటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు


పాలకొల్లు సెంట్రల్: గ్యాస్ ధర పెంపుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్, పెట్రోల్, డీజీల్ ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు డిమాండ్ చేశారు. ధరల పెంపునపై మంగళవారం ఆచంట సంతమార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశా రు. బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌వీఎస్ శర్మ, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లాబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు పాల్గొన్నారు.

పెనుగొండలో

గ్యాస్ ధరల పెంపునపై పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.720 కోట్లు భారం మోపిందని మండల కార్యదర్శి షేక్ పాదుషా విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, రాజమహేంద్రవరపు వెంకటేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పెంచిన గ్యాస్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్యాస్ ధర పెంపుతో వినియోగదారులపై భారం వేసిందన్నారు. ప్రస్తుత మార్కెట్లో నిత్యావసర సరుకులు ధరలు పెరిగి కొనుగోలు శక్తి తగ్గుతుంటే గ్యాస్ ధర పెంచి వినియోగదారునిపై మరింత భారం మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేసి పెంచిన ధరను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, వై.అజయ్‌కుమార్, పురుషోత్తం, సానబోయిన దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికసంఘం నాయకులు

నరసాపురం: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నరసాపురంశాఖ, నరసాపురం వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ దాసి రాజుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘంనేత బూడిద జోగేశ్వరరావు, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేత ఒగ్గు సత్యనారాయణ మాట్లాడుతూ చేనేతకు అనుబంధంగా ఉన్న వృత్తుల వారికి 200 యూనిట్స్ వరకూ విద్యుత్ ఉచితంగా అందించాలని కోరారు. చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరారు. నేతన్న హస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోగస్ చేనేత కార్మిక సంఘాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాసా రామలింగ్ బాళ్ల భవానీప్రసాద్, పిచ్చుక కొండబాబు, కుందెం బాలాజీ, కొమ్మని రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేంకటేశ్వరుని తీర్థ మహోత్సవం


మార్టేరులోని వేంకటేశ్వరస్వామి తీర్థం లో భక్తుల సందడి


భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని ఆలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరుని తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం ఆవరణ అంతా భక్తులతో పోటెత్తింది. మార్టేరు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తుల స్వామివారి ఆలయం వద్ద బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయగా తీర్థ మహోత్సవంలో పెనుమంట్ర ఎస్సైకె.స్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పాత వంతెన మీదుగా పెనుమంట్ర –మార్టేరు వెళ్లే రహదారిని పూర్తిగా బ్లాక్ చేసి అత్తిలి –భీమవరం వెళ్లే వాహనాలను కొత్త వంతెన మీదుగా మళ్లించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని గజేంద్ర వాహనంపై ఉంచి మేళ తాళాలు, కోలాట నృత్య భజనలతో గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థ మహోత్సవంలో భక్తులు దాహార్తి తీర్చేందుకు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం, మానవత స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశాయి. శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన మండ విజయ గౌతమి రెడ్డి–సెర్మిష రెడ్డి దంపతులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదన స్వీకరించారు. క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్ రంగులరాట్నం వద్ద భారీ సందడి నెలకొంది. పెనుమంట్ర చెందిన తేతలి సత్యనారాయణ రెడ్డి దంపతులు స్వామి వారికి సమర్పించిన అర్పించిన 36 కేజీల లడ్డు ప్రసాదాన్ని ఆలయ కమిటీ బహిరంగ వేలం వేసింది. మంగళవారం సాయంత్రం సమయంలో బాణసంచా కాల్పులు ఆకట్టుకుంది.

రక్షణ గోడ నిర్మాణ పనుల పరిశీలన


పెదమైనవానిలంకలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసిరాజు

నరసాపురం రూరల్: మండలంలోని పెదమైనవాని లంక గ్రామంలో తీరప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు రక్షణగోడ నిర్మించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టిన చర్యల్లో భాగంగా ఢిల్లీకి చెందిన డిలైట్ కంపెనీ సంస్థ పనులు చేపట్టనుందని ఆర్డీఓ దాసి రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన డిలైట్ సిబ్బందితో కలసి రక్షణ గోడ నిర్మాణం చేపట్టబోయే ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల్లో భాగంగా సర్వే చేపట్టి అక్కడి జిరాయితీ భూమిలో ఉన్న 8 మంది రైతులకు చెందిన 26 కొబ్బరి చెట్లును రైతుల అనుమతితో తొలగించారు. అయితే చెట్లు నష్టపోయిన రైతులకు వాల్టా యాక్టు ప్రకారం నష్టపోయిన ఒకచెట్టు స్థానే రెండు చెట్లు నాటే ప్రాతిపదికపై తిరిగి 52 చెట్లను నాటే విధంగా రైతులను ఒప్పించారు. గ్రామంలో సముద్ర కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని ఆర్డీఓ సూచించారు. డిలైట్ ప్రతినిధులతో రక్షణ గోడ నిర్మాణ పనులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అయితం సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా నిందితులకు జరిమానా

పాలకోడేరు: సారా కేసులో ఆరుగురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన ఆరుగురు పుప్పాల రామకృష్ణ (కుముదవల్లి), చేబ్రోలు శ్రీనివాసరావు (పెన్నాడపాలెం), చెల్లంకి రామాంజనేయులు (పాలకోడేరు), ఇరగవరపు శ్రీనివాసరావు (మోగల్లు), తాళం రామకృష్ణ (కుముదవల్లి), ఘంటసాల లీలావతి (మైప)లను మంగళవారం అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి ఎదుట హాజరు పరిచారు. ఏడాది కాల పరిమితిలో మరలా నేరం చేస్తే లక్ష రూపాయలు చెల్లించాలని తహసీల్దార్ వారిని హెచ్చరించినట్లు ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు.

మద్యం షాపు సేల్స్‌మేన్‌పై ఫిర్యాదు

భీమవరం: రెండో పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్న సేల్స్‌మేన్‌పై రూ.3.75 లక్షలు వాడుకున్నట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. ఈ నెల 2 నుంచి 6 వరకు లెక్కలు చూపలేదని, రూ.3.75 లక్షలు వాడుకున్నట్లు తెలుస్తుందని కె.శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై ఇజ్రాయేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

CHANGE OF NAME

I, VARDHIPARTHI DURGARAO (New Name), S/O Veerabhadrarao, Previously Called DURGA RAO VADDIPARTHI (Old Name), Resident of D.No:2-10, Garuvu, Penumantra Village, Penumantra Mandal, W.G.Dt., Pin:534124, Andhrapradesh. I have changed my name from DURGA RAO VADDIPARTHI (Old Name) To VARDHIPARTHI DURGA RAO (New Name) for all practical purposes.

వైభవంగా స్వామి వార్ల కల్యాణోత్సవాలు


పెనుగొండ: సిద్ధాంతంలో కల్యాణం చేస్తున్న అర్చకులు


యలమంచిలి: రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: స్థానిక శ్రీఉమా సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి మరునాడు దశమికి శ్రీఉమా సోమేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఉమా సమేత సోమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పుర వీధులలో రథోత్సవం నిర్వహించారు. శివాలయం వద్ద ప్రారంభమైన రథోత్సవం సాయంత్రానికి కేశవస్వామి ఆలయానికి చేరుకుంది. రథాన్ని కేశవస్వామి ఆలయం వద్ద నిలిపివేశారు. మళ్లీ బుధవారం ఉదయం కేశవస్వామి ఆలయం నుంచి రథోత్సవాన్ని ప్రారంభించి శివాలయం వద్దకు తీసుకువస్తారు. రథోత్సవం అనంతరం దేవేరుల విగ్రహాలను ఆలయప్రవేశం చేయడంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాలకొల్లులో..

పెనుగొండ: సిద్ధాంతంలోని పార్వతీ సమేత సీతలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాల్దారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దొంతుకుర్తి సత్యనారాయణ వేద మంత్రోచ్చరణతో కోట్ల శేష వెంకట సత్యం, మహాలక్ష్మీ దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సహస్రనామార్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఈఓ కె.జానకి రామరాజు తెలిపారు.